


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 319 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | మంగళవారం 21 జూలై 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :319 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | TUE 21 JULY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur






## ఉక్రెయిన్‌లో కార్గో నౌకపై దాడి..

## నలుగురు భారతీయులతో సహా పలువురు మృతి

- ఉక్రెయిన్‌లోని ఒడెస్సా సమీపంలో పౌర నౌకపై క్షిపణి దాడి
- ధాన్యం లోడుతో వెళుతున్న పౌర కార్గో నౌక లక్ష్యంగా దాడి
- దాడిలో మరో భారతీయుడికి తీవ్ర గాయాలు

పెన్ పవర్ డెస్క్:ఉక్రెయిన్‌లోని ఒడెస్సా నౌకాశ్రయం సమీపంలో పెను విషాదం చోటుచేసుకుంది. ధాన్యంతో వెళుతున్న ఒక పౌర కార్గో నౌకపై క్షిపణి దాడి చేయడంతో, నలుగురు భారతీయులతో సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. నల్ల సముద్రంలో పౌర నౌకల భద్రతకు పొంచి ఉన్న ముప్పును ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. కాగా, ఈ క్షిపణి దాడి చేసింది రష్యానే అని ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. టర్కీకి చెందిన, గినియా–బిస్సావ్ పతాకంతో ప్రయాణిస్తున్న 'గోల్డెన్ లియో' అనే బల్క్ క్యారియర్ నౌక, జూలై 19న ఒడెస్సా పోర్టు నుంచి బయలుదేరిన

- మిగతా 2లో

## కొండపనేని టౌన్‌షిప్ పార్కులో మంత్రి నారా లోకేశ్ ముఖాముఖి...

- మంగళగిరిలో తల్లికి వందనం లబ్ధిదారులతో మంత్రి లోకేశ్ భేటీ
- పథకం అమలు, ఆర్థిక సాయం వినియోగంపై ఆరా
- విద్యార్థుల తల్లుల నుంచి సలహాలు, సూచనల స్వీకరణ
- కొండపనేని టౌన్‌షిప్ పార్కులో ముఖాముఖి కార్యక్రమం

- మిగతా 2లో



## తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త రూపు.. నూతన వాహనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు

- రాష్ట్రవ్యాప్తంగా 500 నూతన వాహనాలతో సేవలు అందించనున్న ప్రభుత్వం
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు ఉచిత, సురక్షిత రవాణా
- జీపీఎస్, ఏసీ, సీట్ బెల్టుల వంటి ఆధునిక సౌకర్యాలతో వాహనాల రూపకల్పన
- ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలకు ప్రయోజనం చేకూరనున్న అంచనా

2లో






## సీజేపీ ఆందోళనతో దద్దరిల్లిన దేశ రాజధాని

- సీజేపీ కార్యకర్తలపైకి టియర్ గ్యాస్.. ఢిల్లీలో ఉద్రిక్తత.. పార్లమెంట్ గేట్లు బంద్!
- నీట్ అంశంపై సీజేపీ 'చలో సంసద్' పిలుపు
- పార్లమెంట్ వైపు ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- టియర్ గ్యాస్, లాఠీచార్జ్‌తో ఉద్రిక్తత
- ఢిల్లీలో ఇంటర్నెట్ సేవల నిలిపివేత
- అభిజీత్ దీప్కే నిరాహార దీక్ష విరమణ

- మిగతా 2లో

## భారతదేశ చరిత్రలోనే అత్యంత యువత వ్యతిరేక ప్రధాని మోడీనే



పెన్ పవర్ డెస్క్: ప్రధాని మోడీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే యువత అత్యంత వ్యతిరేక ప్రధాని మోడీనే అని అభివర్ణించారు. పరీక్షలు నిర్వహించడంలో దారుణంగా విఫలమైన విద్యాశాఖ మంత్రిని కనీసం రాజీనామా చేయమని కోరలేని అసమర్థ ప్రధాని మోడీ అని విమర్శించారు. నీట్ పేపర్ 2026 లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

- మిగతా 2లో

## విపక్షాల నిరసనలతో హోరెత్తిన పార్లమెంటు...

## ఉభయసభలు వాయిదా



- నీట్ లీక్‌పై విపక్షాల నిరసనలతో ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాలు
- తీవ్ర గందరగోళం నడుమ ఉభయ సభలు రోజంతటికి వాయిదా
- నీట్ అంశాన్ని ప్రస్తావించకుండా మాట్లాడిన ప్రధాని మోదీ
- విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ పార్లమెంట్ వద్ద ఆందోళనలు
- ఆగస్టు 13 వరకు 19 రోజుల పాటు కొనసాగనున్న సమావేశాలు

2లో



## అయోధ్య టెంపుల్ విరాళాల చోరీ సాధారణ నేరమే..

## రాజకీయం చేయెుద్దు

- అయోధ్య విరాళాల దొంగతనం కేసును రాజకీయం చేయవద్దని సుప్రీంకోర్టు
- ఇది కేవలం నేరానికి సంబంధించిన సాధారణ కేసు అన్న ధర్మాసనం
- సీబీఐ విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్లపై కోర్టు విచారణ
- యూపీ పోలీసుల దర్యాప్తుపై నివేదికను పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం

- మిగతా 2లో



## హైదరాబాద్ కోర్టు కీలక తీర్పు:

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

పెన్ పవర్ డెస్క్:మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో హైదరాబాద్ 12వ అదనపు సెషన్స్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రేమ పేరుతో నమ్మించి ఒక నిరుపేద మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం

- మిగతా 2లో

## కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

- నీట్ వివాదంపై కేంద్రమంత్రి నడ్డాతో భేటీ
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- ఢిల్లీలో 'చలో సంసద్' ర్యాలీ... నిరసనకారులపై లాఠీఛార్జ్
- సమస్యను అంతర్గతంగా చర్చిస్తానని నడ్డా హామీ
- డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టీకరణ

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

## కొండపనేని టౌన్‌షిప్ పార్కులో మంత్రి నారా లోకేశ్ ముఖాముఖి...

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం అమలు తీరును తెలుసుకునేందుకు విద్య, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ లబ్ధిదారులతో నేరుగా సమావేశమయ్యారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలోని బైపాస్ రోడ్డులో ఉన్న కొండపనేని టౌన్‌షిప్ పార్కులో విద్యార్థుల తల్లులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం పిల్లల చదువులకు ఏ విధంగా ఉపయోగపడుతోందో మంత్రి లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. పథకం అమలులో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకునేందుకు లబ్ధిదారులతో ఆయన స్వయంగా మాట్లాడారు. అదే సమయంలో, ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు తల్లుల నుంచి పలు సలహాలు, సూచనలను మంత్రి లోకేశ్ స్వీకరించారు. లబ్ధిదారులు చెప్పిన విషయాలను ఆయన ఓపికగా వింటూ, వాటిని పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయి అభిప్రాయాలతో పథకాన్ని మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగినట్లు తెలుస్తోంది.

## తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త రూపు.. నూతన వాహనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో మాతా--శిశు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం, 'తల్లీ--బిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు సిద్ధం చేసిన 500 నూతన వాహనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు.

ఈ సందర్భంగా వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలను సీఎం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా తల్లీబిడ్డల అవసరాలకు అనుగుణంగా వాహనాల్లో చేసిన మార్పులను అధికారులు ఆయనకు వివరించారు. ఈ సేవలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేలా వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను పరిశీలించి, వాటికి ఆమోదం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలను, వారి నవజాత శిశువులను, సహాయకులను ఉచితంగా, క్షేమంగా వారి ఇళ్లకు చేర్చడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. దీంతో పాటు, అధిక రక్తహీనతతో బాధపడే గర్భిణులు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు తీసుకురావడానికి కూడా ఈ వాహనాలను వినియోగించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 500 ఎఖఎ/వీఖఎ వాహనాల ద్వారా అందించే ఈ సేవలతో ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలు లబ్ధి పొందనున్నారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ కొత్త వాహనాల్లో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు పెద్దపీట వేశారు. వెనుక సీట్లలో సైతం సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కి దిగేందుకు వీలుగా ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్ (ఏసీ), ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక పరికరాలు వంటివి ఏర్పాటు చేశారు. ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అనుసంధానించడం ద్వారా వాటి కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించనున్నారు. వాహనాలపై అధికారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి, త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, జాతీయ ఆరోగ్య మిషన్ (చీఎవీ) అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీజేపీ ఆందోళనతో దద్దరిల్లిన దేశ రాజధాని

కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన చలో సంసద్ నిరసన ర్యాలీ మరింత ఉద్రిక్తంగా మారింది. ఉదయమే నిరసనకారులను జంతర్ మంతర్ వద్ద నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ.. వాళ్లు ముందుకు సాగారు. పలు అంచెల్లో ఏర్పాటు చేసిన భద్రతను దాటుకొని మరీ దాదాపు పార్లమెంటు సమీపంలోకి చేరుకున్నారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ ప్రయోగించాల్సి వచ్చింది. లాఠీఛార్జ్ కూడా చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొని తోపులాట జరిగింది. దీంతో పలువురు నిరసనకారులతో పాటు పోలీసులకూ గాయాలయ్యాయి. ఇదంతా పార్లమెంటుకు 200 మీటర్ల దూరంలోనే జరిగింది. ఈ క్రమంలో పార్లమెంట్ ప్రధాన ద్వారాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. కొన్ని గేట్లను మూసివేశారు. ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేశారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు తమ కార్యకర్తలు ప్రశాంతంగా ఉండాలని సీజేపీ పిలుపునిచ్చింది. శాంతియుత పోరాటంతోనే లక్ష్యాన్ని సాధిస్తామని సోషల్ మీడియాలో పేర్కొంది. ఈ ఆందోళనకు ముందు పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నిరాహార దీక్ష చేపట్టారు. అయితే ఆత్మహత్య చేసుకున్న ఓ నీట్ విద్యార్థిని తండ్రి విజ్ఞప్తి మేరకు దీక్ష విరమించినట్లు సీజేపీ తెలిపింది. పార్లమెంట్ ర్యాలీకి నాయకత్వం వహించాల్సిన అవసరం ఉందని ఆయనను ఒప్పించడంతో దీక్ష ముగిసిందని పార్టీ వెల్లడించింది. జంతర్‌మంతర్ వద్ద మరో వివాదం కూడా చెలరేగింది. ఎలాంటి అత్యవసర పరిస్థితి లేకపోయినా ఒక అంబులెన్స్‌ను నిరసన ప్రాంగణంలోకి పంపారని సీజేపీ ఆరోపించింది. దాంతో తొక్కిసలాట జరిగే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది. శాంతియుతంగా జరుగుతున్న ఆందోళనను భంగం కలిగించేందుకే ఇలా చేశారని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది.

## విపక్షాల నిరసనలతో హోరెత్తిన పార్లమెంటు... ఉభయసభలు వాయిదా

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం వాడివేడిగా ప్రారంభమయ్యాయి. నీట్-యూజీ పేపర్ లీక్ కుంభకోణంపై తక్షణమే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో, తొలిరోజే ఉభయ సభలు రోజంతటికీ వాయిదా పడ్డాయి. ఈ సమావేశాలు ఆగస్టు 13 వరకు జరగనుండగా, మొత్తం 19 పనిదినాలు ఉన్నాయి. ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా దివంగత సభ్యులకు నివాళులర్పించి, సభ గౌరవాన్ని కాపాడాలని సభ్యులను కోరారు. కానీ, ప్రతిపక్ష సభ్యులు నీట్ వివాదం, విద్యార్థుల ఆత్మహత్యలపై నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో స్పీకర్ మొదట సభను మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆ తర్వాత కూడా గందరగోళం కొనసాగడంతో రేపటికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే తరహా దృశ్యాలు కనిపించాయి. సమావేశాలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడుతూ.. స్కైరూట్ రాకెట్ ప్రయోగం, హైడ్రోజన్ రైలు వంటి విజయాలను ప్రస్తావిస్తూ దేశ యువతను ప్రశంసించారు. అయితే, దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నీట్ వివాదంపై ఆయన ఏమీ మాట్లాడలేదు. మరోవైపు, నీట్ లీక్‌లకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ (కాక్‌రోచ్ జనతా పార్టీ) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వరకు ర్యాలీ చేపట్టారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ పరిసరాల్లో ఢిల్లీ పోలీసులు, ఆర్‌ఏఎఫ్ బలగాలతో భారీ భద్రత ఏర్పాటు చేసి, నిషేధాజ్ఞలు విధించారు. ఈ సమావేశాల్లో హోం మంత్రి అమిత్ షా 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు'ను ప్రవేశపెట్టనున్నారు.

## హైదరాబాద్ కోర్టు కీలక తీర్పు: పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- మొదటి పేజి తరువాయి

కఠిన శిక్ష విధించింది.

పోక్సో చట్టం కింద నమోదైన ఈ కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. దీంతో పాటు రూ. 10 వేల జరిమానా కూడా విధించింది. ఒకవేళ ఈ జరిమానా చెల్లించకపోతే, నిందితుడు మరో 6 నెలల పాటు అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. 2021లో కామాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘోరం వెలుగుచూసింది. బాలికపై లైంగిక దాడి జరిగినట్లు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. అత్యంత వేగంగా దర్యాప్తు పూర్తి చేశారు. నిందితుడిపై ఉన్న అభియోగాలను రుజువు చేసేందుకు పక్కా సాంకేతిక ఆధారాలను కోర్టుకు సమర్పించారు. పోలీసులు సమర్పించిన టిష్టమైన ఆధారాలను పరిశీలించిన గౌరవ న్యాయస్థానం.. నిందితుడిని దోషిగా తేల్చి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష ఖరారు చేసింది. బాధితురాలికి న్యాయం జరిగేలా పక్కా ఆధారాలతో నిందితుడికి శిక్ష పడేలా చేసిన పోలీసు అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు.

# ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు ..!







- అయ్యవారి బాగోతాలు -3
- వేగేశ్వరపురం టు భీమడోలు..
- భీమడోలు రిజిస్ట్రార్ ఆఫీసులో ప్రైవేట్ మహిళ పెత్తనం..
- రికార్డు రూమ్ తాళాలు ఆమె చేతిలోనే ఎందుకు?

**వేగేశ్వరపురం నుంచి భీమడోలు వరకు సదరు సబ్ రిజిస్ట్రార్ అవినీతి ప్రస్థానం అప్రతిహతంగా సాగుతోంది. సామాన్యులను పీడించడంలో, ప్రైవేట్ వ్యక్తులకు ప్రభుత్వ రికార్డులను అప్పగించడంలో ఈ 'అయ్యగారి' రూటే సెపరేటు అంటూ బాధితులు గగ్గోలు పెడుతున్నారు. తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో విధులు నిర్వహించి, ప్రస్తుతం భీమడోలులో తిష్టవేసిన సదరు అధికారి వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ బదిలీ వార్తతో పాత పాపాలు మళ్లీ పండాయి. ఆయన ఎక్కడ పనిచేస్తే అక్కడ వివాదాలు, అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడం ఇప్పుడు రిజిస్ట్రేషన్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.**

**ఈ నేపథ్యంలో 'పెన్ పవర్' అందిస్తున్న ప్రత్యేక విశ్లేషణాత్మక కథనం... ఎపిసోడ్ 5:**

- వేగేశ్వరపురంలో సామాన్యులకు చుక్కలు చూపించిన వైనం
- భీమడోలుకు మారినా మారని సబ్ రిజిస్ట్రార్ నైజం
- ప్రభుత్వ పెద్దలకు చేరిన అధికారిక అవినీతి ఫిర్యాదులు
- బినామీల పేర్లతో హైదరాబాద్, విజయవాడల్లో అక్రమాస్తుల పర్వం
- ఆఫీసులో ప్రభుత్వ సిబ్బంది డమ్మీ.. ప్రైవేట్ మహిళే సుప్రీం!
- రికార్డు రూమ్ తాళాలు ప్రైవేట్ మహిళ చేతిలోనే ఎందుకు?
- రంగ ప్రవేశం చేసిన ప్రైవేట్ 'త్రిమూర్తులు'.. అంతా వారి ఇష్టారాజ్యం
- అప్లికేషన్ 'బరువు'ను బట్టి ముందే సిద్ధమవుతున్న 'రేట్ కార్డ్'
- ఇది ప్రభుత్వ కార్యాలయమా.. లేక ప్రైవేట్ దళారుల అడ్డానా?
- శాఖా పరమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఎడిటర్ పెన్ పవర్ ఏలూరు /భీమడోలు , జూలై 20 : గతంలో వేగేశ్వరపురం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ అధికారి పనిచేసిన కాలంలో రిజిస్ట్రేషన్ సేవల కోసం వచ్చిన సామాన్య ప్రజలు నరకం చూశారు. చిన్నపాటి పనుల కోసం కూడా రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పించుకోవడం, దరఖాస్తులను అనవసరంగా పెండింగ్‌లో పెట్టడం ఆయనకు అలవాటుగా మారిందని స్థానికులు మళ్లీ గుర్తు చేసుకుంటున్నారు. భీమడోలుకు మారినా మారని నైజం స్థాన చలనం కలిగి భీమడోలు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చినప్పటికీ సదరు అధికారి తన పంథాను మార్చుకోలేదు. పైగా ఇక్కడ అక్రమ వసూళ్లు, ప్రజలతో కఠిన ప్రవర్తన, రైతులను ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలతో మరింతగా రెచ్చిపోయారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ పెద్దలకు చేరిన అధికారిక ఫిర్యాదులు : ఈ అధికారి వేధింపులు, అవినీతి పరాకాష్టకు చేరడంతో బాధితులు ఏకంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (భూమి, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపులు) గారికి ఆధారాలతో సహా అధికారికంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సబ్ రిజిస్ట్రార్ వ్యవహారం ఇప్పుడు సచివాలయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

బినామీల పేర్లతో హైదరాబాద్, విజయవాడల్లో అక్రమాస్తులు? : ఫిర్యాదుదారులు పేర్కొన్న వివరాల ప్రకారం.. ఈ సబ్ రిజిస్ట్రార్ సామాన్య ప్రజల నుంచి, రైతుల నుంచి అక్రమంగా వసూలు చేసిన సొమ్ముతో విజయవాడ, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో తన కుటుంబ సభ్యులు, బినామీల పేరిట భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు తెలుస్తోంది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. ఆఫీసులో ప్రభుత్వ సిబ్బంది డమ్మీ.. ప్రైవేట్ మహిళే సుప్రీం! : భీమడోలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో వింత పోకడలు సాగుతున్నాయి. ప్రభుత్వ జీతాలు తీసుకునే అధికారిక సిబ్బందిని పక్కనపెట్టి, ఒక ప్రైవేట్ మహిళకు సదరు అధికారి అసాధారణ ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజలు ముందుగా ఆమెనే కలవాలనే అలిఖిత నిబంధన అక్కడ నడుస్తోంది.

రికార్డు రూమ్ తాళాలు ప్రైవేట్ మహిళ చేతిలోనే ఎందుకు? : ఏళ్ల తరబడి అత్యంత భద్రంగా ఉండాల్సిన ప్రభుత్వ ల్యాండ్ రికార్డులు, విలువైన పత్రాలు ఉండే రికార్డు రూమ్ తాళాలు ఆ ప్రైవేట్ మహిళ ఆధీనంలో ఉండటం అత్యంత ప్రమాదకరంగా మారింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ వ్యవహారం వెనుక ఉన్న 'చిదంబర రహస్యం' ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రంగ ప్రవేశం చేసిన ప్రైవేట్ 'త్రిమూర్తులు' : ఆఫీసులో ఆ మహిళ పెత్తనం ఒకెత్తయితే.. కార్యకలాపాలను శాసించడానికి ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులు రంగంలోకి దిగారు. స్థానిక సమాచారం ప్రకారం.. "కుదిరితే శ్రీరాముడు... లేకపోతే అశోకుడు... లేదంటే రాజు..." అనే సూత్రంతో ఈ ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులే ఆఫీసులో అసలు నిర్ణయాధికారులుగా చలామణి అవుతున్నారు. అప్లికేషన్ బరువును బట్టి 'రేట్ కార్డ్' సిద్ధం : కార్యాలయానికి వచ్చే ప్రతి దరఖాస్తు స్వభావాన్ని బట్టి ఈ ప్రైవేట్ త్రిమూర్తులే ముందుగా ఒక 'రేట్ కార్డ్' సిద్ధం చేస్తారట. ఏ అప్లికేషన్‌కు ఎంత వసూలు చేయాలి, ఎవరికి ఎంత వాటా వెళ్ళాలి అనేది దరఖాస్తు 'బరువు' (ఆస్తి విలువ)ను బట్టి ముందే ఫిక్స్ చేస్తారని నమ్మదగిన సమాచారం.

ఇది ప్రభుత్వ కార్యాలయమా.. ప్రైవేట్ అడ్డానా? : ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాల్సిన ఒక ప్రభుత్వ శాఖ, కొందరు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో బందీ అయిపోవడంతో సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఫీసుకు వస్తే ప్రభుత్వ అధికారుల కంటే ఈ ప్రైవేట్ దళారుల కాళ్లు పట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారుల పారదర్శక విచారణకై డిమాండ్ : ప్రభుత్వ రికార్డుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తూ, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన భీమడోలు సబ్ రిజిస్ట్రార్ వ్యవహారంపై జిల్లా రిజిస్ట్రార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. సమగ్ర విచారణ జరిపి, నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు...

**వృద్ధుడు ఇచ్చిన ఫిర్యాదు పై... స్థానికులు ఇచ్చిన పిర్యాదులపై ఆ శాఖ అదికారులు ఎందుకు మౌనం గా ఉన్నారు.. ? నోట్ల కట్ల తో నోర్లు మూయించాడా...? నిజమేనా ..? చదువుతూనే ఉండండి పెన్ పవర్ మరిన్ని ఆధారాలతో ఎపిసోడ్ -6 లో...**

## అయోధ్య టెంపుల్ విరాళాల చోరీ సాధారణ నేరమే.. రాజకీయం చేయొద్దు

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి మందిర విరాళాల దారిమళ్లింపు కేసును రాజకీయం చేయవద్దని సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా హెచ్చరించింది. ఈ కేసులో సీబీఐ విచారణ జరిపించాలని, ట్రస్టు ఆర్థిక లావాదేవీలపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్ల విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. "ఇది కేవలం నేరపూరిత చర్యకు సంబంధించిన ఒక సాధారణ కేసు. ఈ అంశాన్ని రాజకీయం చేయవద్దని మేము హెచ్చరిస్తున్నాము" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న దర్యాప్తు పురోగతిపై సమర్పించిన నివేదికను పరిశీలించిన తర్వాత తగిన ఆదేశాలు జారీ చేస్తామని కోర్టు పేర్కొంది. భక్తులు సమర్పించిన నగదు, బంగారం, వెండి వంటి విలువైన వస్తువులను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులోని కొందరు వ్యక్తులు దారిమళ్లించారన్న ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. యూపీ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక విచారణ అనంతరం ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు కేంద్ర సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరించారు. దర్యాప్తు కొనసాగుతున్నందున, మరిన్ని వివరాలను ప్రస్తుతం బహిర్గతం చేయలేమని ఆయన తెలిపారు.

ఈ కేసులో నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిగేలా సిట్‌ను పునర్వ్యవస్థీకరించే అంశంపై సూచనలు తీసుకోవాలని కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. అయితే, తప్పుడు ప్రచారాలకు ఆస్కారం ఉంటుందన్న కారణంతో ఎఫ్‌ఐఆర్, దర్యాప్తు నివేదికలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలన్న అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. పారదర్శకత కోసం పక్కాగా రికార్డులను నిర్వహించాలని స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. పిటిషనర్ల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ వాదనలు వినిపిస్తూ, బంగారం, వెండి వస్తువులు అదృశ్యమవుతున్నాయని, విరాళాలకు సరైన లెక్కలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణ సమయంలో భక్తులకు జారీ చేసిన రసీదులను ఒక వెబ్‌సైట్‌లో ఉంచాలని, తద్వారా దాతలు తమ విరాళాలు ట్రస్ట్‌కు చేరాయో లేదో సరిచూసుకోవచ్చని ఆయన సూచించారు. అయితే, ఈ ప్రతిపాదనను ప్రధాన న్యాయమూర్తి తోసిపుచ్చారు.

## భారతదేశ చరిత్రలోనే అత్యంత యువత వ్యతిరేక ప్రధాని మోడీనే

- మొదటి పేజి తరువాయి

చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం (జులై 20) కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా నిరసనకారులపై కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై రాహుల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా ఆందోళన తెలుపుతున్న నిరసనకారులపై లాఠీచార్జ్, టియర్ ప్రయోగం చేయడాన్ని ఉద్దేశిస్తూ మోడీ సర్కార్?పై ఆయన ధ్వజమెత్తారు.

బీజేపీ ప్రభుత్వ హయాంలో 152 ప్రశ్నపత్రాల లీక్ కాగా.. 7.5 కోట్ల మంది విద్యార్థులు బాధితులయ్యారని అన్నారు. ఇప్పటి వరకు ఒక్క దోషికి కూడా శిక్ష పడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కానీ కష్టపడి చదివిన యువతకు మాత్రం శిక్ష పడిందని మండిపడ్డారు. పేపర్ లీకులు, విద్యా వ్యవస్థలోని లోపాలపై ప్రశ్నించిన యువతపై లాఠీ దెబ్బలు, నిర్బంధాలు విధించారని నిప్పులు చెరిగారు.

ప్రశ్నపత్రాలను లీక్ చేసిన నేరగాళ్లు స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారు. కానీ సమస్యలు లేవనెత్తిన విద్యార్థులను ఈడ్చుకెళ్లి దారుణంగా కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ సర్కార్ పేపర్ లీకులతో యువత జీవితాన్ని నాశనం చేయడమే కాకుండా.. తిరిగి వారిపైనే దాడి చేస్తోందని తూర్పారబట్టారు.

**సీజేపీ చలో పార్లమెంట్:**

నీట్ 2026 పేపర్ లీక్, విద్యా వ్యవస్థలోని అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జులై 20న చలో పార్లమెంట్ కార్యక్రమానికి క్రాకోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చింది. సీజేపీ పిలుపు మేరకు యువత పెద్ద ఎత్తున ఢిల్లీ చేరుకుని చలో పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో సీజేపీ పార్లమెంట్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అనుమతి లేదని సీజేపీ మద్దతుదారులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, సీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో సీజేపీ కార్యకర్తలు, మద్దతుదారులపై పోలీసులు విచక్షణరహితంగా లాఠీచార్జ్ చేశారు. అయినప్పటికీ యువత వెనక్కి తగ్గకుండా నిరసన కార్యక్రమాన్ని కొనసాగించింది.

సీజేపీ మద్దతుదారులు పార్లమెంట్ లోపలికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు పార్లమెంట్ గేట్స్ క్లోజ్ చేసి సీజేపీ సపోర్టర్స్ ను అదుపులోకి తీసుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పార్లమెంట్ బయట ఫైర్ బ్రిగేడ్లతో భారీగా పోలీసులను మోహరించారు. పార్లమెంట్ బయట సీజేపీ.. లోపల ప్రతిపక్షాల నిరసనలతో సోమవారం (జులై 20) దేశ రాజధాని ఢిల్లీ దద్దరిల్లింది.

## ఉక్రెయిన్‌లో కార్గో నౌకపై దాడి.. నలుగురు భారతీయులతో సహా పలువురు మృతి

- మొదటి పేజి తరువాయి

కొద్దిసేపటికే ఈ దాడికి గురైంది. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 17 మంది సిబ్బంది ఉన్నారు. సహాయక బృందాలు కొందరిని రక్షించి ఒడెస్సాలోని ఆసుపత్రికి తరలించాయి. ఈ ఘటనలో ఉక్రెయిన్ పైలట్‌తో పాటు మరికొందరు మరణించినట్లు అధికారులు వెల్లడించారు.

ఈ నౌకలో మొత్తం ఐదుగురు భారతీయులు ఉన్నట్లు భారత విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. వారిలో నలుగురు దుర్మరణం పాలవ్వగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉక్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోంది. "ఉక్రెయిన్‌లోని తాజా పరిస్థితులను తమ బృందం నిశితంగా పర్యవేక్షిస్తోందని, బాధితులకు అండగా నిలిచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని విదేశాంగ శాఖ పేర్కొంది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వ్యక్తి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. "వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, అమాయక పౌర సిబ్బంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం, నౌకాయానం మరియు వాణిజ్య స్వేచ్ఛకు ఆటంకం కలిగించడం అత్యంత విచారకరం. ఇలాంటి దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కావు" అని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

## కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీతో పాటు పలు పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఢిల్లీలో నిరసనలు ఉద్ధృతమయ్యాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా ఢిల్లీలోని నడ్డా నివాసంలో సుమారు 10 నిమిషాల పాటు సమావేశమై, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సమస్యపై అంతర్గతంగా ఉన్నత స్థాయిలో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, అయితే ఎటువంటి నిర్దిష్ట హామీలు లభించలేదని సౌరవ్ దాస్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజే సీజేపీ 'పార్లమెంట్ ముట్టడి'కి పిలుపునివ్వడంతో జంతర్ మంతర్ వద్దకు విద్యార్థులు, యువత భారీగా చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నప్పటికీ ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు కొన్నిచోట్ల లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయువును ప్రయోగించారు. సోషల్ మీడియాలో ఒక వ్యంగ్య ఉద్యమంగా ఆరంభమైన కాక్రోచ్ జనతా పార్టీ, ప్రస్తుతం పరీక్షల లీకేజీలు, సాంకేతిక వైఫల్యాలపై నిరంతరాయంగా పోరాడుతోంది. ఈ ఉద్యమానికి మద్దతుగా పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ సుదీర్ఘ నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళనలు ప్రారంభమైన తర్వాత సీజేపీ నేతలతో కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చలు జరపడం ఇదే ప్రథమం. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని సీజేపీ నాయకత్వం తేల్చిచెప్పింది.

## షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన కాజులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గీసాల తేజశ్రీ రమ్య

**కాజులూరు, పెన్ పవర్ జూలై 20:** విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రతిష్ఠాత్మక "షైనింగ్ స్టార్" అవార్డుకు కాజులూరు మండలంలోని ఎంపీపీ ఒ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గీసాల తేజశ్రీ రమ్య ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు షైనింగ్ స్టార్ అవార్డులను అందజేస్తోందన్నారు. ఈ అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు ప్రభుత్వం తరఫున రూ.20 వేల నగదు ప్రోత్సాహకం,మెడల్, ప్రశంసాపత్రం అందజేస్తున్నట్లు తెలిపారు.

గీసాల తేజశ్రీ రమ్య సాధించిన ఈ విజయాన్ని ఇతర విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని పట్టుదలతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన తేజశ్రీ రమ్యను




ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి,ఫస్ట్ అసిస్టెంట్ చింతా నారాయణమూర్తి,పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెంటపాటి పెద్దరాజు,కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు,ఉపాధ్యాయేతర సిబ్బంది హృదయపూర్వకంగా అభినందించి,ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## మాజీ మంత్రి,కాపు ఉద్యమనేత ముద్రగడ
# కిర్లంపూడిలో ఘన నివాళులు.

-సంతాప సూచికంగా ఎస్సీ పేటలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ



**కిర్లంపూడి, పెన్ పవర్,జులై 20:** దివంగనేత మాజీమంత్రి,కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం మృతికి సంతాప సూచికంగా కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి ఎస్సీ పేటలో ఘన నివాళులు అర్పించారు. స్థానిక ఎస్సీ పేటలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులు అర్పించి గ్రామంలోని పురవీధుల గుండా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ముద్రగడ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఘన నివాళులు అర్పించారు. ముద్రగడ మరణం ఎస్సీ పేటకు తీరనిలోటని, ముద్రగడ తమ పట్ల చూపించిన ప్రేమ, ఆప్యాయత, అనురాగాలు మరిచిపోలేనివని అంబేద్కర్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు అన్నారు. ముద్రగడ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరడమే కాకుండా, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు.

## లెనిన్ విజయంపై మెమొంటో అందుకున్న తులా సుకేత్




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 20:** లెనిన్ సినిమా సక్సెస్ మీట్ లో సినీ నిర్మాత, హీరో నాగార్జున మరియు లెనిన్ సినిమా హీరో అఖిల్ చేతుల మీదుగా తూర్పుగోదావరి జిల్లా పంపిణీదారులు శ్రీనివాస మూవీస్ అధినేత జగ్గంపేటకు చెందిన తులా సుకేత్ మెమొంటో అందుకున్నారు. లెనిన్ సినిమా ఎంతో ఘనవిజయం సాధించింది అన్నారు. అఖిల్ అక్కినేని చరిత్రలో గుర్తుండిపోయే సినిమా లెనిన్ అని ఆయన పాత్ర సినీ ప్రేక్షకులు అందరినీ ఆకట్టుకుందన్నారు. అవార్డు అందుకున్న తులా సుకేత్ ను జగ్గంపేట ప్రజాప్రతినిధులు, థియేటర్ల యాజమాన్యాలు అభినందించారు.




## రోడ్డు ఆక్రమణలు పరిశీలించిన
# ఆలమూరు ఎంపీడీవో

### 39 సెంట్లు నీరు మార్గం ఆక్రమణకు గురైంది

**ఆలమూరు, పెన్ పవర్, జూలై 20;** రెండు జిల్లాల సరిహద్దుగా ఉండి ఆక్రమణలకు గురైన ఆలమూరు మండలం మడికి శివారు మల్లావానితోట జిల్లా పరిషత్ రోడ్డును సోమవారం ఆ గ్రామ ప్రత్యేక అధికారి, ఆలమూరు ఎంపీడీవో ఎ. రాజు పరిశీలించారు. కడియం-ఆలమూరు మండలాలకు సరిహద్దు ప్రాంతమైన ఇక్కడ 39 సెంట్లు నీరు పోయేందుకు ప్రభుత్వం స్థలం ఉండేది. దాన్ని పూర్తిగా కబ్జా చేసి ఇల్లు నిర్మించుకుని నీరు పోవడానికి దారి లేకుండా చేశారు. దీంతో కడియం మండలం పొట్టిలంకతో పాటు మాల్లావానితోట, మడికి, నాగులపేట ప్రాంతాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరం ఏర్పడుతుంది. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి పొట్టిలంక ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ లక్షలాది రూపాయలతో 2018లో సిమెంట్ రోడ్డును నిర్మించారు. కాని మోకాలు లోతు నీరు అక్కడ ఉండిపోతుంది. ఆ రోడ్డును ఆక్రమణదారులు రౌండప్ చేయడంతో చుక్క నీరు పోయే మార్గం లేక ఇక్కడ దారుణమైన పరిస్థితి నెలకొంది. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆలమూరు ఎంపీడీవో స్పందించి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పూర్తిగా ఆక్రమణకు గురైన స్థలాన్ని సర్వే చేసి అవన్నీ ఖాళీ చేయించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం, విఆర్ఓ డి సుదర్శన్ బాబు, విలేజ్ సర్వేయర్ మౌనిక తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ ఆక్రమణలతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పొట్టిలంక కూటమి నాయకులు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. అవసరమైతే కోనసీమ జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ఆ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఆ నాయకులు తెలిపారు. ఖాళీ స్థలాలు ఎక్కడున్నా ఆక్రమించుకోవడం సహజం. కాని దానివల్ల ఇబ్బందులు లేకుండా ఉంటే పెద్ద సమస్య కాదు. కాని ప్రజలకు ఇబ్బందులు పడేలా రోడ్డును ఇంత దారుణంగా ఆక్రమించుకుంటే అసలకే ముప్పు వచ్చింది.

# క్షేత్రస్థాయి అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి





**అధికారులకు జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశం**

**కాకినాడ, పెన్ పవర్ జూలై 20:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా 'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, వీబీజీ రామ్‌జీ హాజరు శాతం, గ్రామాల్లో అభివృద్ధి పనుల పురోగతి, హార్టికల్చర్ ప్లాంటేషన్, జలధార--జలహారతి కార్యక్రమాలు, వాట్సాప్ గవర్నెన్స్, చిన్నారుల ఆధార్ నమోదు, అక్షర ఆంధ్రా రిజిస్ట్రేషన్, పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటా తడి--పొడి చెత్త సేకరణ, తాగునీటి ట్యాంకుల శుద్ధి వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలని సూచించారు. ముఖ్యంగా 'తల్లికి వందనం' పథకంలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌ను వెంటనే పూర్తి చేయాలని, వీబీజీ రామ్‌జీ హాజరు శాతాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్, జలధార--జలహారతి వంటి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన చేపట్టి గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయాలని సూచించారు. పాలనలో పారదర్శకత కోసం వాట్సాప్ గవర్నెన్స్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, చిన్నారుల ఆధార్ నమోదు, అక్షర ఆంధ్రా రిజిస్ట్రేషన్‌ను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండేలా నిరంతర పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, ఇంటింటా తడి--పొడి చెత్త సేకరణను క్రమబద్ధంగా నిర్వహించాలని తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు తాగునీటి ట్యాంకుల శుద్ధిని తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని, నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మణరావు, డ్వామా పీడీ మధుసూదన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మతిన్, పంచాయతీరాజ్ ఎస్ఈ ఏవీఎస్ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, డీఈ రవికుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కొత్తూరుకు గ్రామానికి విద్యుత్ వెలుగులు రెండు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు...

### ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా

**శంఖవరం పెన్ పవర్ జూలై 20:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో శంఖవరం మండలంలోని కొంతంగి కొత్తూరు గ్రామంలో సుమారు రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న విద్యుత్ మౌలిక వసతుల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభిస్తోంది. గ్రామంలోని ప్రతి వీధికి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, వీధిలైట్లను అమర్చే పనులు ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. దీంతో గ్రామ ప్రజల్లో ఆనందం నెలకొంది.

ఇన్నేళ్లుగా గ్రామంలోని అనేక వీధుల్లో విద్యుత్ స్తంభాలు లేకపోవడం, ఉన్న స్తంభాలు శిథిలా వ్యవస్థకు చేరుకోవడం, వీధి దీపాలు ఏర్పాటు కాకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు రాత్రి సమయంలో బయటకు వెళ్లేందుకు భయపడేవారు. వర్షాకాలంలో చీకటి కారణంగా ప్రమాదాలు జరిగే పరిస్థితులు కూడా ఏర్పడేవని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ఈ సమస్యను గుర్తించిన జనసేన నాయకులు గొర్లి నాగేశ్వరరావు గ్రామ ప్రజల తరఫున కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యను సానుకూలంగా స్వీకరించిన ఎంపీ, ఎమ్మెల్యే వెంటనే విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.

విద్యుత్ శాఖ జగ్గంపేట డివిజన్ డీఈ వీరభద్రరావు, ప్రత్తిపాడు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు కొత్తూరు గ్రామంలో స్వయంగా పర్యటించి, ప్రతి వీధిని పరిశీలించారు. ఎక్కడెక్కడ విద్యుత్ స్తంభాలు అవసరమో గుర్తించి ప్రణాళిక రూపొందించారు. అనంతరం అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి వీధిలో ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేసే పనులను వేగవంతం చేశారు.

గ్రామంలో విద్యుత్ మౌలిక వసతులు మెరుగుపడడం వల్ల రాత్రి వేళల్లో ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు భద్రత కూడా పెరుగుతుందని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

గ్రామానికి ఇన్నేళ్ల తర్వాత విద్యుత్ వెలుగులు తీసుకొచ్చిన ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, విద్యుత్ శాఖ అధికారులు, అలాగే సమస్య పరిష్కారానికి కృషి చేసిన జనసేన నాయకుడు గొర్లి నాగేశ్వరరావుకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఇదొక కీలక ముందడుగుగా అభివర్ణిస్తూ, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను కూడా ఇదే విధంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



## తల్లికి వందనం' పథకం కోసం ఇతర శాఖల నిధులను మళ్లించడం దురదృష్టకరం ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్



**అల్లవరం,పెన్ పవర్, జూలై 20:**తల్లికి వందనం' పథకం అమలు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలు, సంస్థల నిధులను మళ్లించడం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్య అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ తీవ్రంగా విమర్శించారు.దేవదాయ శాఖ నుంచి రూ.26.03 కోట్లను విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు ఇవ్వడం, బ్రాహ్మణ కార్పొరేషన్ పరిధిలోని 'తల్లికి వందనం' లబ్ధిదారులకు చెల్లింపుల కోసం ఈ నిధులను వినియోగించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోందని ఆయన అన్నారు.ప్రభుత్వం తన సాధారణ ఆదాయ వనరులతో సంక్షేమ పథకాలను అమలు చేయాల్సింది పోయి, వివిధ శాఖల నిధులను మళ్లిస్తూ పథకాలను కొనసాగించడం ఆర్థిక క్రమశిక్షణకు విరుద్ధమని పేర్కొన్నారు. ఒక శాఖ అవసరాల కోసం కేటాయించిన నిధులను మరో పథకానికి వినియోగించడం వల్ల సంబంధిత శాఖల అభివృద్ధి కార్యక్రమాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది కూడా కొందరికే 'తల్లికి వందనం' పథకం అమలు చేస్తున్నారని,ఈ ఏడాది 22.65 లక్షల మందికి ఎగనామం పెట్టబోతుందని,యూడైస్ గణాంకాలను బట్టి 87.41 లక్షల మంది విద్యార్థులు ఉంటే కేవలం64.76 లక్షల మందికి మాత్రమే తల్లికి వందనం పథకం అమలు చేస్తుంది అన్నారు.ఇతర శాఖల నిధులను మళ్లించే విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని బొమ్మి ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 20:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ జాబ్ సోమవారం మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో ఫాక్స్ కాన్, ఎమ్ ఆర్ ఎఫ్ కంపెనీల్లో 300 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ జాబ్ మేళాలో కళాశాల పూర్వ విద్యార్థులు, తృతీయ సంవత్సర విద్యార్థులు, ఇతర అభ్యర్థులు మొత్తం 200 మంది నిరుద్యోగ యువతి యువకులు హాజరయ్యారు. వీరిలో 11 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు కళాశాల ప్రిన్సిపల్ చెన్నారావు చేతుల మీదుగా అందజేశారు.

## జగ్గంపేటలో దస్తావేజు లేకర్ల నిరసన



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 20:** జగ్గంపేట సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు సోమవారం నిరసన తెలియజేశారు. జీవో నెంబర్ 396కు వ్యతిరేకంగా ఈ నెల 20 తేదీ నుండి 31వ తేదీ వరకు డాక్యుమెంట్ రైటర్లు పెన్ డౌన్ ప్రకటించారు. జీవో నం 396 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దాంతో రిజిస్ట్రేషన్ సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సేవలతో పాటు కక్షిదారుల స్వంత వ్యవహారమైన దస్తావేజుల తయారీ విధానమును కూడా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగిస్తూ జారీ చేసిన జీవో నెంబర్ 396ను వ్యతిరేకిస్తూ డాక్యుమెంట్ రైటర్లు పెన్డౌన్ ప్రకటించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద డాక్యుమెంట్ రైటర్లు పెన్డౌన్ ప్రకటించి నిరసన తెలియజేయడం వలన జగ్గంపేట రిజిస్టర్ కార్యాలయం బోసిపోయింది. ఈ నిరసన కార్యక్రమంలో జోర్యుల రామచంద్రమూర్తి, ముసిరెడ్డి నాగేశ్వరరావు, వాడ్రేపు శ్రీనివాసరావు, రామరాజు సూర్య ప్రకాశరావు, రామేశ్వరపు పార్థసారథి, వేముల శేషగిరిరావు, పినిశెట్టి ముత్యాలరావు, చిట్యాల జగ్గారావు, ముత్యాల వి.వి దుర్గాప్రసాద్, రీసు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న జగ్గంపేట అక్షర విద్యార్థినిలు



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 20**: ఇంటర్మీడియట్ 2025-26 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం కాకినాడ జిల్లా నుండి 35 మంది విద్యార్థులను షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కు ఎంపిక చేయగా అందులో అక్షర జూనియర్ కళాశాలకు చెందిన కేసనకుర్తి రోజి, సవితాల అంజన ఎంపిక అయినట్లు కాకినాడ జిల్లా డిఐఈఓ ప్రకటించారు. సోమవారం కాకినాడ టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా రూ.20 వేల నగదు మరియు అవార్డు అందుకునట్లు కళాశాల కరస్పాండెంట్ ఆళ్ళ రవికిషోర్ తెలిపారు. అవార్డు అందుకున్న రోజి, అంజనలను కళాశాల ఛైర్మన్ పాఠంశెట్టి సతీష్ బాబు, కరస్పాండెంట్ ఆళ్ళ రవికిషోర్, ప్రిన్సిపాల్ నీలం వివి చక్రధర, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# రైతులను ముంచింది ప్రభుత్వ వైఫల్యమే





**వాడపల్లి సైఫన్‌పై విచారణ జరపాలి: జగ్గిరెడ్డి..**

**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 20:**కోనసీమ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న సాగునీటి సంక్షోభానికి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం, ఇరిగేషన్ శాఖ వైఫల్యం, వేసవి కెనాల్ క్లోజర్ పనుల్లో జరిగిన అవినీతే ప్రధాన కారణమని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆరోపించారు. ఒకవైపు వేల ఎకరాల్లో వరి నారుమళ్లు, పంటలు మునిగిపోతుండగా, మరోవైపు శివారు ప్రాంతాల్లో సాగునీరు అందక భూములు ఎండిపోతున్న దుస్థితి ఏర్పడిందన్నారు.

సంపద సృష్టిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రైతులకు కనీస సాగునీరు కూడా అందించలేకపోయిందని విమర్శించారు. ఖరీఫ్‌లో వేల కోట్ల రూపాయల విలువైన పంటలను పండించే సామర్థ్యం ఉన్న ఈ ప్రాంతంలో నీటి నిర్వహణలో జరిగిన నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. వేసవిలో కాలువలు మూసివేసిన సమయంలో పూడికతీత, తూముల శుభ్రపరిచే పనులు, మట్టి అడ్డంకుల తొలగింపు వంటి నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టలేదని, అందువల్ల అధిక పరిమాణంలో నీటిని విడుదల చేసినప్పటికీ చివరి ఆయకట్టుకు నీరు చేరలేదని అన్నారు.

వేల ఎకరాల్లో నారుమళ్లు నీట మునిగిపోవడంతో రైతులు బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెట్టి తెచ్చుకున్న రుణాలతో కూడా సాగు ప్రారంభించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు శివారు ప్రాంతాల్లో సాగునీరు అందక భూములు ఎండిపోతుండటంతో రైతులు రెండు విధాలుగా నష్టపోతున్నారని చెప్పారు.

ఇటీవల కోనసీమ పర్యటనకు వచ్చిన ఇరిగేషన్ మంత్రి సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించకుండా నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లోనే పర్యటించి ఫోటోషూట్లతో కాలం గడిపారని విమర్శించారు. ప్రచార కార్యక్రమాల కంటే రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వాడపల్లి వద్ద రూ.2.90 కోట్ల వ్యయంతో నిర్మించిన సైఫన్ వల్ల ముంపు సమస్య తగ్గకపోగా మరింత పెరిగిందని ఆరోపించారు. ఆ నిర్మాణ పనులతో పాటు కాలువల నిర్వహణలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం విడుదల చేశామని చెబుతున్న నిధులు ఎక్కడ ఖర్చయ్యాయో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, అనేక ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు కూడా తీవ్రంగా ఉన్నాయని విమర్శించారు. కాలువల గట్టులపై ఆక్రమణల తొలగింపుతో పాటు కాలువల్లో పేరుకుపోయిన పూడిక, తూములు, లాకుల వద్ద మట్టిని తొలగించి సాగునీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ముంపునకు గురైన ఖరీఫ్ పంటలకు వెంటనే పూర్తి స్థాయి నష్టపరిహారం ప్రకటించాలని, ఇరిగేషన్ శాఖలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ర్యాలిలో పోలీసుల కూంబింగ్.. అసాంఘిక శక్తులకుఎస్ ఐ ఎస్ రాము హెచ్చరిక





**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 20:**ర్యాలి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్. రాము ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో పోలీసు సిబ్బందితో కలిసి కూంబింగ్, పెట్రోలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో అనుమానాస్పద ప్రాంతాలను తనిఖీ చేసిన పోలీసులు, యువత చెడు వ్యసనాలు మరియు పెడదారుల్లో వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎస్. రాము హెచ్చరించారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా సాగుతుందని ఎస్ఐ తెలిపారు.

## ర్యాలిలో భక్తిశ్రద్ధలతో వారాహి పారాయణం



**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 20 :** కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి శ్రీ అన్నపూర్ణ దేవి ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి సహస్ర గాజుల పూజ, సహస్ర కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు.

గురువు పసుపులేటి గంగా నాగమణి ఆధ్వర్యంలో లలితా మహిళా సమాజానికి చెందిన మహిళలు వారాహి పారాయణాన్ని అత్యంత భక్తి భావంతో నిర్వహించారు.

అనంతరం అన్నపూర్ణ శేఖర్, నెమలిపురి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సమకూర్చిన అమ్మవారి రవికెల గుడ్డలు, గాజులు, పసుపు, కుంకుమ, పండ్లు, ప్రసాదాలను మహిళలకు పంపిణీ చేశారు.

సాయంత్రం సీనియర్ భజన కళాకారుడు ధనుంజయ రాజు ఆధ్వర్యంలో వారాహి భజన కార్యక్రమం ఘనంగా నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు.

## సర్ ప్రక్రియలో బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**రావులపాలెం పెన్ పవర్ జూలై 20:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) అప్రమత్తంగా వ్యవహరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా, అదే సమయంలో నకిలీ ఓట్ల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు.

సోమవారం రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో ఆత్రేయపురం, రావులపాలెం మండలాల పార్టీ నాయకులు, బీఎల్‌ఏలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇప్పటివరకు మృతుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లు, గుర్తుతెలియని (అన్‌ఐడెంటిఫైడ్) ఓట్లకు సంబంధించిన జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించారని తెలిపారు. ఇక నుంచి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా బీఎల్‌ఏలు మరింత బాధ్యతతో పనిచేయాలని ఆయన సూచించారు. సర్ ప్రక్రియ విజయవంతానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని, ఓటరు జాబితా పరిశీలనలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆత్రేయపురం మండల అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, కస్టర్ ఇన్చార్జులు ముదునూరి వెంకటరాజు, కాయల జగన్నాధరావు, కరటూరి నరసింహారావు, రావుల పాలెం మండల అధ్యక్షులు కొప్పిశెట్టి ప్రసాద్. యూనిట్ ఇన్చార్జిలు బూత్ ఇంచార్జ్ లు పాల్గొన్నారు

## షైనింగ్ స్టార్ అవార్డు గ్రహీత సాకా గీతికకు అభినందనల వెల్లువ




**రావులపాలెం పెన్ పవర్ జూలై 20:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు అందజేస్తున్న 'షైనింగ్ స్టార్' అవార్డుల ప్రదానోత్సవం సోమవారం అమలాపురంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏపీ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రావులపాలెం మండలంలోని లక్ష్మీపోలవరం గ్రామానికి చెందిన సాకా గీతిక తన ప్రతిభకు గుర్తింపుగా రూ.20 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందుకుంది.పదో తరగతిలో కష్టపడి చదివి మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన గీతిక విజయాన్ని పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# జీవో 396కు వ్యతిరేకంగా ప్రత్తిపాడు దస్తావేజు లేఖర్లు నిరవధిక నిరసన



- **సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు**
- **ప్రభుత్వ నిర్ణయంతో దస్తావేజు లేఖర్ల మనుగడ ప్రశ్నార్థకం**

**కిర్లంపూడి,ప్రత్తిపాడు,పెన్ పవర్, జూలై 20:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు సోమవారం పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు.దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి.స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో సంస్కరణల పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 396ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖర్లు నిరవధిక సమ్మెకు దిగారు.ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు.ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ జీఓ 396 అమలుతో తమ ఉపాధిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రైవేట్ రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ద్వారా జరిగే ప్రతి దస్తావేజు లావాదేవీపై రూ.2 వేలు అదనపు రుసుము వసూలు చేసే విధానం సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని,ఈ నెల 31 వరకు పెన్‌డౌన్ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు పంచదార్ల నాగేశ్వరరావు,ఉపాధ్యక్షుడు అత్తి ఉమా మహేశ్వరరావు, పలువురు దస్తా వేజు లేఖర్లు పాల్గొన్నారు.






## ముద్రగడ కుటుంబానికి సజ్జల రామకృష్ణారెడ్డి పరామర్శ.





- **తాను నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పోరాడిన నాయకుడు ముద్రగడ**
- **ఆయన మృతి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు తీరని లోటు.**

**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై 20:**కాకినాడ జిల్లా కిర్లంపూడిలో మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత స్వర్గీయ ముద్రగడ పద్మనాభం సమాధి వద్ద వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ముద్రగడ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి సంతాపం వ్యక్తం చేశారు.స్వర్గీయ ముద్రగడ పద్మనాభం కుమారులు, ముద్రగడ వీర రాఘవరావు (బాలు )ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు లను పరామర్శించి కుటుంబ సభ్యులకు తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం వంటి మహోన్నత వ్యక్తిని రాష్ట్రం కోల్పోయిందన్నారు.ఆయన జీవితమంతా సమాజం కోసం,తాను నమ్మిన ప్రజల కోసం అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు.ముద్రగడ పదవులు లేదా రాజకీయ ప్రయోజనాలను ఆశించకుండా ప్రజల కోసం పోరాడిన అరుదైన నాయకుడని కొనియాడారు.తనకు ముద్రగడతో వ్యక్తిగత పరిచయం తక్కువే అయినప్పటికీ,ఆయన జీవితం నుంచి ఎంతో నేర్చుకున్నానని తెలిపారు.పేదల సంక్షేమం,తాను నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాంతం కృషి చేశారన్నారు.వైఎస్ జగన్ ఆశయాలు నచ్చడంతోనే 2024లో ముద్రగడ వైఎస్సార్‌సీపీలో చేరారని,జగన్ నాయకత్వంలో రాష్ట్రం ప్రజల జీవితం మెరుగుపడుతుందని ఆయన విశ్వసించారని తెలిపారు.మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చూడాలనే లక్ష్యంతో చివరి వరకు పనిచేశారని తెలిపారు.కాపునాడు,కాపు ఉద్యమాల ద్వారా వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగాలని ముద్రగడ ఆకాంక్షించారని సజ్జల పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తోట నరసింహం,కురసాల కన్నబాబు,అంబటి రాంబాబు,జోగి రమేష్,చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, సాకే శైలజానాథ్, మాజీ ఎంపీలు వంగా గీతా విశ్వనాథ్, మార్గాని భరత్, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, జక్కంపూడి రాజా,కాకినాడ కార్పొరేషన్ మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న,కుడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి,నాయకులు వంగవీటి నరేంద్ర, తోట రాంజీ,తోట రామకృష్ణ,సత్తి సూర్యనారాయణరెడ్డి,ఒమ్మి రఘురామ్,కర్రి పాపారాయుడు తదితరులు పాల్గొని ముద్రగడకు ఘన నివాళులర్పించారు.

## అన్నవరం దేవస్థానంలో అభివృద్ధి పనుల వేగవంతం:

**దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ క్షేత్రస్థాయి పరిశీలన**





**అన్నవరం పెన్ పవర్ జూలై 20 :**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన వివిధ అభివృద్ధి మరియు నిర్మాణ పనులను దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ నేడు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించారు. ఈ పర్యటనలో దేవస్థానం చైర్మన్ ఐ.వి. రోహిత్ మరియు ఈవో నల్లం సూర్య చక్రధర్ రావు పాల్గొని, జరుగుతున్న పనుల పురోగతిని కమిషనర్‌కు వివరించారు.

?నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి:

కమిషనర్ తన పర్యటనలో భాగంగా దేవస్థానంలో జరుగుతున్న పలు కీలక ప్రాజెక్టులను పర్యవేక్షించారు:

?అన్నదాన భవనం: కేంద్ర ప్రభుత్వ 'ప్రసాదం' పథకంలో భాగంగా చేపట్టిన అన్నదాన భవన నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని, భవిష్యత్తులో వేలాది మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించేలా నిర్మాణంలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.

?వసతి గృహాలు ఌ ఇతర సౌకర్యాలు: నిర్మాణ దశలో ఉన్న సీతారామ సత్రం పనులను పర్యవేక్షిస్తూ, నిర్మాణ నాణ్యతపై ఈఈలను ఆరా తీశారు. అలాగే, హరిహర సదన్ పరిసరాలను పరిశీలించి, భక్తుల కోసం అక్కడ కల్పించాల్సిన అదనపు వసతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

?సత్యగిరిపై పారిశుద్ధ్యం: భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సత్యగిరిపై నిర్మిస్తున్న నూతన పబ్లిక్ బాత్రూమ్స్ సముదాయం నిర్మాణ తీరును ఆయన సమీక్షించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండాలని స్పష్టం చేశారు.

?అధికారులకు స్పష్టమైన ఆదేశాలు:

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, "దేవస్థానంలో భక్తులకు కల్పించే ప్రతి సదుపాయం అత్యుత్తమంగా ఉండాలి. అభివృద్ధి పనుల విషయంలో ఎటువంటి జాప్యం ఉండకూడదు. పారదర్శకతతో కూడిన పాలనను అందిస్తూ, రాబోయే రోజుల్లో భక్తులకు మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు యాజమాన్యం కట్టుబడి ఉండాలి" అని సూచించారు.

?ఈ కార్యక్రమంలో ఈఈలు రామకృష్ణ, నూకరత్నం, భూతాది సూపరింటెండెంట్ రామకృష్ణ, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, ఆలయ అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.

## వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్య అన్నదానానికి రూ.90 వేల విరాళం



**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 20:**వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి నిలువెత్తు దర్శనం చేసుకుంటూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు. స్వామివారి నిత్య అన్నదాన పథకానికి ప్రత్తిపాడు మండలానికి చెందిన జుత్తిగ చంద్రశేఖరరావు, వారి కుమార్తె వెంకట గురు ప్రియతో పాటు కుటుంబ సభ్యులు రూ.90,000లను విరాళంగా అందజేశారు.

దాతలను ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వదించగా ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు.

## రోడ్డు నిర్మాణ పనుల్లో పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలి.

- **కిర్లంపూడి,ఎంపీపీ తోట రవి,వీరవరం సొసైటీ అధ్యక్షుడు తోట గాంధీ.**



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 20:**జగ్గంపేట ఎమ్మెల్యే,టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ,కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కృషితో నిర్మాణంలో ఉన్న వీరవరం–రామవరం రహదారి పనులను కిర్లంపూడి ఎంపీపీ తోట రవి,వీరవరం సొసైటీ అధ్యక్షులు తోట గాంధీ పరిశీలించారు.రహదారి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన వారు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ ఈఈ రాఘవరావు,ఏఈ ప్రసాద్ పనుల వివరాలను వివరించారు.ఈ సందర్భంగా ఎంపీపీ తోట రవి,వీరవరంసొసైటీ అధ్యక్షులు తోట గాంధీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామాలను పట్టణాలతో అనుసంధానం చేసే రహదారుల నిర్మాణం ద్వారా ఆర్థిక అభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు.రహదారులు అందుబాటులోకి రావడం వల్ల రైతులు, వ్యాపారులు, విద్యార్థులకు ప్రయాణ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటికి తక్షణ పరిష్కారం చూపడం కూటమి ప్రభుత్వ అభివృద్ధి విధానమని స్పష్టం చేశారు.

## ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా 119వ వ్యవస్థాపక దినోత్సవం



**గండేపల్లి, పెన్ పవర్,జులై,20:** మండలంలో మల్లేపల్లి గ్రామంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ ఆవరణలో సోమవారం బ్రాంచ్ మేనేజర్ నరేష్ ఆధ్వర్యంలో బ్యాంక్ ఆఫ్ బరోడా 119వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు ముందుగా బ్రాంచ్ వ్యవస్థాపకుడు సాయా జీరావు గైక్వాడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కేక్ కట్ చేసి ఖాతాదారులకు స్వీట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా మేనేజర్ నరేష్ మాట్లాడుతూ ఖాతాదారుల సహకారంతో బరోడా బ్యాంక్ విజయవంతంగా ముందుకు వెళ్తుంది అన్నారు అలాగే బ్యాంక్ ఆఫ్ బరోడా లో ఎడ్యుకేషన్స్ లోన్స్ ఇంటి రుణాలు పంటల రుణాలు సకాలంలో అందిస్తున్నామన్నారు అలాగే ఖాతాదారులు సైబర్ నేరస్తుల పట్ల అప్రమత్తంగా ఉండి బ్యాంకు ఎకౌంట్లోను కాపాడుకోవాలన్నారు ఎవరికి ఓటీపీలు చెప్పకూడదన్నారు ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ సందీప్ అలాగే సిబ్బంది ప్రభాకర్ బ్రాంచ్ ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేటర్ పాఠశాలల దీటుగా స్పోర్ట్స్ యూనిఫామ్స్ పంపిణీ....




**తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నవరం ట్రస్ట్ బోర్డ్ నెంబర్ పర్వత సురేష్...**

**శంఖవరం పెన్ పవర్ జులై 20:–** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం గ్రామం లో గల మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల నెంబర్.1 (ఆర్ ఎస్) శంఖవరం పాఠశాల నందు తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ పర్వత సురేష్ పాఠశాల లో గల 70 మంది విద్యార్థులకు సుమారు 35000 రూపాయలు విలువైన స్పోర్ట్స్ యూనిఫామ్ ను శంఖవరం గ్రామం నాకు చెందిన ఒక "అజ్ఞాత దాత " ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుని, విద్యార్థులు ఏ విషయం లోను తక్కువ కాకూడదు అని ప్రవేట్ పాఠశాలకు దీటుగా నిలవాలి అనే సంకల్పంతో టీచర్స్ అభ్యర్థన మేరకు ఆ దాత సూచించిన విధంగా యూనిఫామ్ ను అందచేస్తున్నారు ఈ కార్యక్రమము నాకు శంఖవరం మండల విద్యాశాఖ అధికారి సూరిశెట్టి వెంకటరమణ , ఏపీ మోడల్ స్కూల్ ఏ.వీర రాజు,జిల్లా పరిషత్



హై స్కూల్ పాఠశాల ఉపాధ్యాయులు ,మండల యుటిఎఫ్, ఏపీ యుఎస్ సంఘ నాయకులు పాల్గొన్నారు–

# పాయల రాము కుటుంబానికి యుటిఎఫ్ రూ.3 లక్షల ఆర్థిక సాయం.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూలై 20**: మండల కేంద్రమైన ప్రత్తిపాడు మెయిన్ పాఠశాలలో సెకండరి గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పాయల రాము ఇటీవల మృతి చెందారు. ఆయన మృతికి సంతాపంగా ప్రత్తిపాడు మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు.గోదావరి యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకంలో సభ్యుడిగా ఉన్న పాయల రాము కుటుంబానికి మండల శాఖ తరఫున రూ.3 లక్షల చెక్కును అందజేశారు.మండల అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంవీ సాయిరాం,మండల విద్యాశాఖ అధికారి వి రాజబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు వీవీ రమణ, తోట సీతారామయ్య,జిల్లా కుటుంబ సంక్షేమ డైరెక్టర్ ఆర్,రామలింగేశ్వరరావు,మండల ప్రధాన కార్యదర్శి ఎంవీ రమణ,మండల నాయకులు జీఎస్ ప్రసాద్ బాబు,సీహెచ్ గణేష్,పల్లా సత్తిబాబు,ఎం స్వామికుమార్,ఎస్ నాగేశ్వరరావు,సీహెచ్‌వీ సూర్యావతి, ఏ తాతబ్బాయి,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన అభివృద్ధి ముద్రగడకే దక్కుతుంది.

- ఆయన మృతి నియోజకవర్గ ప్రజలకు తీరని లోటు.
- ప్రత్తిపాడులో స్వర్గీయ మాజీ మంత్రి ముద్రగడకు ఘన నివాళులు.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 20**:ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన ఘనత మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత స్వర్గీయ ముద్రగడ పద్మనాభం కే దక్కుతుందని పలువురు వైసీపీ నేతలు అన్నారు. మండల కేంద్రమైన ప్రత్తిపాడు లైయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్ లో సోమవారం సాయంత్రం స్వర్గీయ ముద్రగడ సంతాప సభను ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి నాయకులు ఏడిది రెడ్డి రాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గ వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైసిపి నాయకులు పాల్గొన్నారు. ముందుగా ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నేతలు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గానికి , నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, కాకినాడ పార్లమెంటు సభ్యునిగా పనిచేసి సుబ్బారెడ్డి సాగర్, చంద్రబాబు సాగర్ వంటి నీటి ప్రాజెక్టులను తీసుకురావడంతోపాటు కాకుండా,నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసారని కొనియాడారు. ఆయన మృతి ఆయన కుటుంబానికే కాకుండా, నియోజకవర్గ ప్రజలకు తీరని లోటని తెలియజేశారు.ఈ సందర్భంగా ముద్రగడ కుటుంబానికి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని,సానుభూతిని తెలియజేయడమే కాకుండా, ముద్రగడ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థించారు. ప్రతిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వారి కుమారుడు ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు కు ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శేరు కృష్ణ, చిలకమర్తి వెంకటరమణ, చలంకూరి రామకృష్ణ, పిల్లా చిట్టోడు, గొల్ల శేఖర్, మేడి బోయిన శేఖర్, కోట శాంతి, వాసా లవకుశుడు,చెవల ప్రసాద్ అధిక సంఖ్యలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు

- ఏడీఏ జి.శ్రీనివాస్



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 20:** అధిక ధరలకు ఎరువులు విక్రయించిన, సరుకు నిల్వలు రికార్డుల్లో సరిగ్గా లేకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని సహాయ వ్యవసాయ సంచాలకులు గరిమెల్ల శ్రీనివాస్ జగ్గంపేట సబ్ డివిజన్ డీలర్లను హెచ్చరించారు. ఏడిఏ శ్రీనివాస్, జగ్గంపేట వ్యవసాయ అధికారి జి.నరసింహం సోమవారం జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో శ్రీ మణికంఠ రైతు మిత్ర సంఘం ఎరువుల డీలర్ వద్ద యూరియా సూపర్ ఫాస్ట్, గ్రానుల్స్ ఎరువు ఈపాస్ మెషిన్ లో నమోదు చేయకుండా నిల్వ చేయడం జరిగిందని అందుచే రూ.2.77 లక్షల విలువైన 260 బస్తాలు ఎరువును అమ్మకాలు నిలుపుదల చేయాలని ఆదేశించామన్నారు. ఎక్కడైనా ఎరువులు అధిక ధరలకు వికరిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని వారిపై తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

## గిరిజన మహిళలకు కూరగాయల నార్లు, విత్తనాల పంపిణీ...

స్వరాజ్య అభ్యుదయ సేవా సమితి (సస్ ),లిన్సి ఫౌండేషన్ సహకారం...



**శంఖవరం /రౌతులపూడి పెన్ పవర్ జూలై 20** గిరిజన గౌరవం ప్రాజెక్టు ఆధ్వర్యంలో మహిళలకు కూరగాయల నార్లు, విత్తనాల పంపిణీ కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో రౌతులపూడి మండలంలోని జల్దాం మరియు మత్తెయ్యపేట గ్రామాలలో స్వరాజ్య అభ్యుదయ సేవా సమితి (సస్ ), లిన్సి ఫౌండేషన్ సహకారంతో అమలు చేస్తున్న “గిరిజన గౌరవం” ప్రాజెక్టు ఆధ్వర్యంలో మహిళలకు పెరటి తోటల ఏర్పాటును ప్రోత్సహించే ఉద్దేశ్యంతో వంకాయ, టమాటా, మిరప నార్లతో పాటు వివిధ రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గిరిజన కుటుంబం తమ ఇంటి ఆవరణలోనే పోషకాహార విలువలు కలిగిన తాజా కూరగాయలను సాగు చేసుకునేలా ప్రోత్సహించడం, కుటుంబ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ఆహార భద్రతను పెంపొందించడం మరియు మిగులు దిగుబడిని విక్రయించడం ద్వారా మహిళలకు అదనపు ఆదాయాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ పూజ, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.డి. సఫూరా పాల్గొని పెరటి తోటల ప్రాముఖ్యత, సేంద్రియ సాగు పద్ధతులు, మొక్కల సంరక్షణ మరియు పోషకాహారంపై మహిళలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా గ్రామ మహిళలు, గ్రామ పెద్దలు మరియు ప్రాజెక్టు సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ సహస్ర విద్యానికేతన్ విద్యార్థినికి షైనింగ్ స్టార్ అవార్డు



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 20:** ఇంటర్మీడియట్ లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం వారిని ప్రోత్సహించేందుకు షైనింగ్ స్టార్స్ అవార్డులను ప్రధానం చేసింది. దీనిలో భాగంగా జగ్గంపేట శ్రీసహస్ర విద్యానికేతన్ కు చెందిన విద్యార్థిని నామాల సృజన హారిక ఇంటర్ లో 600కు 580 మార్కులు సాధించడంతో సోమవారం కాకినాడ జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు స్వీకరించింది. ఈ సందర్భంగా శ్రీసహస్ర పాఠశాల డైరెక్టర్ కందుల మణికంఠ కుమార్ విద్యార్థిని సృజన హారికను ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.

## సిఐ విద్యాసాగర్ తనయుడికి ఎస్పీ, ఎమ్మెల్యేల అభినందనలు





**ఆలమూరు, పెన్ పవర్, జూలై 20;**ప్రతిష్టాత్మకంగా జరిగే జేఈఈ మెయిన్స్ లో ఆలిండియా 1001 వ ర్యాంకు సాధించడమే గాక ఏపీ ఎంసెట్ లో 99 వ ర్యాంకు సాధించిన రావులపాలెం రూరల్ సిహెచ్ విద్యాసాగర్ తనయుడు రుచిత్ సాయికి అభినందనలు వెల్లువెత్తాయి. దేశంలోనే ప్రసిద్ధి చెందిన మద్రాస్ ఐఐటీలో సీటు దక్కించుకున్న సాయి ని సోమవారం పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు లు శాలువాలతో సత్కరించి అభినందించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, అడిషనల్ ఎస్పీ ఎమ్.మహేంద్ర, కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్ తదితరులు సాయిని అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే ఆణిముత్యం లాంటి తనయుడు కలిగిన విద్యాసాగర్ కు కూడా వీరంతా ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## ముద్రగడ కుటుంబానికి వంగవీటి రాధా, ఉండవల్లి, గుడివాడ తోపాటు పలువురు నేతలు పరామర్శ.

-ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు.





**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 20:** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత స్వర్గీయ ముద్రగడ కుటుంబానికి వంగవీటి మోహన్ రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణ(రాధా),మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ తో పాటు పలువురు రాజకీయ నాయకులు, ముద్రగడ అభిమానులు పరామర్శించారు. వీరితోపాటు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్,ప్రముఖ విద్యాసంస్థల చైర్మన్ కెవివి సత్యనారాయణరాజు ( చైతన్య రాజు )మాజీ మంత్రులు ,కురసాల కన్నబాబు , తోట నరసింహం, ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు, పిల్లి సూర్య ప్రకాష్ వైసిపి విద్యార్థి విభాగం నాయకులు తోట రాంజీ,కూటమి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, తుమ్మలపల్లి రమేష్,జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు చిలుకూరి రాంకుమార్,

ముద్రగడ పద్మనాభం ఆకస్మిక మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం, ముద్రగడ కుమారులు ముద్రగడ బాలు , ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు లను పరామర్శించారు.ముద్రగడ అపారమైన ఆత్మీయతను, రాజకీయాలకు అతీతంగా సాగిన ఆ బంధాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. నిబద్ధతతో కూడిన ఒక గొప్ప ప్రజా గొంతుక మూగబోవడం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేస్తూ.. ముద్రగడ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు కొండంత ధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. వీరితోపాటు తూర్పుగోదావరి జిల్లా నుండి భారీ సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు,కూటమి నాయకులు కిర్లంపూడి తరలివచ్చి ముద్రగడ సమాధి వద్ద, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించడమే కాకుండా, వారి కుటుంబానికి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసారు.

## ద్వారకాతిరుమలలో పోలీసుల ఆధ్వర్యంలో శక్తి యాప్, చట్టాలపై అవగాహన సదస్సు



**పెన్ పవర్ ၊ ద్వారకాతిరుమల ၊ జూలై 20** ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ టి. సుధీర్ ఆధ్వర్యంలో ప్రజలకు, ముఖ్యంగా మహిళల భద్రత, రక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా శక్తి యాప్ ప్రాముఖ్యతను వివరిస్తూ, మొబైల్‌లో యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, అత్యవసర పరిస్థితుల్లో ఎలా వినియోగించుకోవాలో పోలీసులు ప్రత్యక్షంగా చూపించారు. ఆపద సమయంలో మహిళలు తక్షణ సాయం పొందేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

అలాగే, కొత్తగా అమల్లోకి వచ్చిన లిలిభారతీయ న్యాయ సంహితలోని ముఖ్యమైన నిబంధనలు, సెక్షన్లపై ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన పెరిగితేనే నేరాలను నివారించడం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్ఐ సుధీర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పోలీసుల సూచనలను ఆసక్తిగా ఆలకించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చదరంగంపై అవగాహన

## చదరంగం కేవలం ఆట కాదు.. మేధస్సును పదునుపెట్టే మానసిక వ్యాయామం: డాక్టర్ అడ్డాల



**కాకినాడ, పెన్ పవర్ జూలై 20:**అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చదరంగం ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్యులు, చదరంగ క్రీడాకారులు డా. అడ్డాల విద్యార్థులతో ముచ్చటిస్తూ చెస్ ఆట వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.ఈ సందర్భంగా డా. అడ్డాల మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూలై 20న అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. మేధోశక్తిని పెంపొందించే చదరంగం క్రీడపై అవగాహన కల్పించడం, ఈ ఆటను మరింత ప్రోత్సహించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు.ప్రపంచంలో అత్యంత ప్రాచుర్యం పొందిన ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ 1924 జూలై 20న పారిస్‌లో స్థాపించబడిన సందర్భంగా ప్రతి ఏడాది ఇదే తేదీన చెస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని వివరించారు.

చెస్ ఆడటం వల్ల వ్యూహాత్మక ఆలోచనా శక్తి, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ప్రతి పావు కదలికపై దృష్టి కేంద్రీకరించడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని, ప్రత్యర్థి వ్యూహాలను విశ్లేషించడం, గత ఆటల పద్ధతులను గుర్తుంచుకోవడం ద్వారా జ్ఞాపకశక్తి, మెదడు పనితీరు మెరుగుపడుతాయని పేర్కొన్నారు.

ఆటలో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితుల్లో వేగంగా, సరైన నిర్ణయం తీసుకోవడం చెస్ ద్వారా అలవడుతుందని, విజయం సాధించాలంటే తొందరపాటు కాకుండా సహనం, సమయస్ఫూర్తి అవసరమని ఈ ఆట నేర్పుతుందన్నారు. అలాగే గెలుపు--ఓటములను సమానంగా స్వీకరించడం, చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవడం వంటి విలువలు కూడా చెస్ ద్వారా అభివృద్ధి చెందుతాయని చెప్పారు.చెస్ ఆడటం వల్ల మెదడులోని లాజికల్ (ఎడమ) మరియు క్రియేటివ్ (కుడి) భాగాలు ఒకేసారి చురుకుగా పనిచేస్తాయని, వయస్సు పెరుగుతున్న కొద్దీ వచ్చే జ్ఞాపకశక్తి తగ్గుదల, ఇతర మానసిక సమస్యలను నివారించడంలో కూడా చదరంగం మంచి మానసిక వ్యాయామంగా ఉపయోగపడుతుందని డా. అడ్డాల వివరించారు.విద్యార్థులు చదువుతో పాటు చెస్ వంటి మేధో క్రీడలను అలవాటు చేసుకోవాలని, ఇది వారి వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్ విజయాలకు బలమైన పునాది అవుతుందని ఆయన సూచించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## షైనింగ్ స్టార్ అవార్డుతో కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని షేక్ తనీషా సత్కారం






**కాజులూరు, పెన్ పవర్ జూలై 20:** కాకినాడ టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ప్రతిష్ఠాత్మక "షైనింగ్ స్టార్" అవార్డు కార్యక్రమంలో కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం హెచ్ఈసీ విద్యార్థిని షేక్ తనీషా ఘన సత్కారం అందుకుంది.ఇటీవల నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో 1000 మార్కులకు గాను 897 మార్కులు సాధించిన ఆమెకు కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు రూ.20,000 నగదు బహుమతి, ప్రశంసాపత్రం మరియు మెడల్ అందజేశారు.ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై అవార్డు గ్రహీతలను అభినందించారు. షేక్ తనీషా సాధించిన విజయంపై కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్. శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## షైనింగ్ స్టార్ అవార్డులతో మెరిసిన ధర్మవరం శ్రీ ప్రతిభ విద్యాలయ విద్యార్థులు.

-ఎమ్మెల్యే సత్యప్రభ,జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూలై, 20:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన 2025-26 విద్యా సంవత్సర పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రదానం చేసే ప్రతిష్ఠాత్మక 'షైనింగ్ స్టార్ అవార్డులు' శ్రీ ప్రతిభ విద్యాలయ విద్యార్థులను వరించాయి.కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన శ్రీ ప్రతిభ విద్యాలయ (ఇంగ్లీష్ మీడియం) విద్యార్థులు పెచ్చెట్టి దేవి శ్రీ,బాతు ప్రసన్నకుమార్ ఈ అరుదైన గౌరవాన్ని అందుకున్నారు.సోమవారం కాకినాడ టీటీడీ కళ్యాణ మండపంలో జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా,జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా వారికి బంగారు పతకం,ప్రశంసా పత్రం,రూ.20 వేల నగదు బహుమతి అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ దాసం శేషారావు మాట్లాడుతూ విద్యార్థుల పట్టుదల,ఉపాధ్యాయుల అంకితభావం,తల్లిదండ్రుల సహకార ఫలితంగానే ఈ ఘన విజయం సాధ్యమైందన్నారు.భవిష్యత్తులోనూ నాణ్యమైన విద్యను అందిస్తూ మరింత మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు శ్రీ ప్రతిభ విద్యాలయ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు,విద్యార్థులు,తల్లిదండ్రులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్,కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలి



**శ్రేణులకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచన.**

**ఆలమూరు, పెన్ పవర్,జూలై 20;**ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ముగింపు దశకు చేరుకుంటున్నందున పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, వలస వెళ్లిన ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించి, ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా జాగ్రత్త పడాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు.మండల కేంద్రమైన ఆలమూరు వినాయక కన్వెన్షన్ హాల్లో నాయకులకు, బీఎల్ఏలతో సోమవారం నిర్వహించిన ఎస్ఐఆర్ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, సర్ ప్రక్రియలో బీఎల్ఏలు మరింత లోతుగా పనిచేయాలని సూచించారు. మృతుల ఓట్లు, శాశ్వత వలసదారుల ఓట్లు, గుర్తుతెలియని (అన్ ఐడెంటిఫైడ్) ఓట్లకు సంబంధించిన జాబితాలను సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కును కోల్పోకుండా చూడాలని ఆయన అన్నారు.అలాగే బూత్ ఏజెంట్లు పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని, వారి సేవలను పార్టీ ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు కల్పించడంతో పాటు, వారికి ఏ అవసరం వచ్చినా పార్టీ అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తలే బలమని, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ఓటర్ల హక్కులను కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, డిసి చైర్మన్ మెర్ల గోపాలస్వామి, పిఏసిఎస్ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, కేతా రాంబాబు,దూనే స్వామినాయడు, నాగిరెడ్డి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు

## ద్వారకాతిరుమల శ్రీ స్వామివారి శాశ్వత అన్నదాన ట్రస్టుకు రూ. లక్ష విరాళం



పెన్ పవర్ । ద్వారకాతిరుమల । జూలై 20 ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి శాశ్వత అన్నదాన ట్రస్టుకు తణుకు వాస్తవ్యులు పి. వెంకటేశ్వరరావు, నాగసుధ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సూపరింటెండెంట్ ఐ.వి. రామారావు వారి నుంచి విరాళాన్ని స్వీకరించి, దాతలకు విరాళ రసీదు (బాండ్)ను అందజేశారు. శ్రీ స్వామివారి నిత్యాన్నదాన సేవలో భాగస్వాములైన దాతలను ఆలయ అధికారులు అభినందించి, స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

## ముద్రగడ పద్మనాభం మృతి కాపు సామాజిక వర్గానికి తీరని లోటు

- పద్మనాభం చిత్రపటానికి, సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించిన జనసేన





**ఆలమూరు, పెన్ పవర్,జూలై 20;**ఇటీవల అనారోగ్యంతో స్వర్గస్థులైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, ప్రముఖ కాపు రిజర్వేషన్ ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం మృతి తీరని లోటని కోత్తపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులో నాలుగు మండలాల్లోని జనసేన నేతలు, జన సైనికులంతా కలుసుకుని సోమవారం కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ముందుగా ముద్రగడ చిత్రపటానికి, సమాధికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ముద్రగడ కుమారులు బాలు, గిరిబాబు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే రాజమహేంద్రవరంలో ముద్రగడ కుమార్తె బార్లపూడి క్రాంతిని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్రగడ ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగాను పనిచేశారని, నమ్మిన సిద్ధాంతాల కోసం, ప్రజా సమస్యల పైన రాజీలేని పోరాటాలు చేసిన మహానాయకుడని అయన కొనియాడారు. పద్మనాభం ముక్కుసూటి మనిషని దాపరికం లేని రాజకీయం చేశారని కొనియాడారు. ముద్రగడ పద్మనాభం సేవలు, సామాజిక ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు సూరపురెడ్డి సత్య, కంఠంశెట్టి సత్యప్రసాద్ (చంటి ), చేకూరి కృష్ణంరాజు, జనసేన నేతలు సంగీత సుభాష్, దొంగ వెంకట సుబ్బారావు, గారపాటి శ్రీనివాస్,నల్లా వెంకన్న, మెర్ల నాగేశ్వరరావు, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు,సలాది జేపీ, కొత్తపల్లి నగేష్, తూలా రాజు, అంబటి కిశోర్, వున్నమట్ల బాలకృష్ణ, పసుపులేటి వీరబాబు,పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## సైనింగ్ స్టార్ అవార్డు గ్రహీతకు పలువురు అభినందనలు



**కిర్లంపూడి, పెన్ పవర్,జులై 20:** కాకినాడ జిల్లా మండల కిర్లంపూడి శ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ గ్రూప్ నుండి ఉత్తమ ప్రతిభ కనబరచిన కిర్లంపూడి గ్రామానికి చెందిన మూరా దాసుకు సైనింగ్ స్టార్ అవార్డు అందుకోవడంతో కిర్లంపూడి గ్రామానికి చెందిన పలువురు పెద్దలు అభినందనలు తెలియజేశారు. మంగళవారం కిర్లంపూడి మండల కేంద్రమైన కిర్లంపూడి లో జగపతినగరం గ్రామ మాజీ సర్పంచ్ గుడాల శ్రీలతా,.రాంబాబు చేతుల మీదగా సాలువా కప్పి ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థిని, విద్యార్థులకు ఈ విధమైన అవార్డులు రావడంతో విద్యార్థుల్లో మరింత ఉత్సాహం పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సాదే ఏసుబాబు, కట్టు నాని బాబు, మూరా చిరంజీవి,చుక్కా సుబ్బారావు, పందుల అనిల్ కుమార్, బంగారు దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# మాస్ మహారాజా కొత్త లవ్ స్టోరీ... ఆ హీరోయిన్ తో రొమాన్స్ ఫిక్స్!



అక్షర గౌడ ఫ్యాషన్ సీక్రెట్స్





అదితి మెరిసే చీర లుక్‌లో తలదాచుకుంది

టాలీవుడ్‌లో సరికొత్త మల్టీస్టారర్ కాంబినేషన్లకు ఎప్పుడూ విపరీతమైన క్రేజ్ ఉంటుంది. ముఖ్యంగా బాక్సాఫీస్ వద్ద తనదైన మాస్ ఎనర్జీతో దూసుకుపోయే 'మాస్ మహారాజా' రవితేజ, విలక్షణమైన కామెడీ టైమింగ్‌తో అలరించే హీరో శ్రీవిష్ణు కలయికలో ఓ భారీ హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం రూపుదిద్దుకోబోతోంది. అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మాణంలో, టాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలి తెరకెక్కించనున్న ఈ సినిమా గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక సెన్సేషనల్ న్యూస్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ క్రేజీ మల్టీస్టారర్‌లో రవితేజ సరసన జోడీగా నటించబోయే హీరోయిన్ ఎవరనే సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. ఆ వివరాలు చూద్దాం..

**మలయాళ ముద్దుగుమ్మతో మాస్ మహారాజా రొమాన్స్:**

ఈ మోస్ట్ అవైటెడ్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో రవితేజ సరసన కథానాయికగా మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ ఎంపికైనట్లు టాలీవుడ్ వర్గాల్లో గట్టిగా టాక్ వినిపిస్తోంది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కేయు మోహనన్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మాళవిక, తన గ్లామర్ మరియు యాక్టింగ్ స్కిల్స్‌తో సౌత్ ఇండియాలోనే మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఇక ఈ సరికొత్త కాంబో వెండితెరపై సరికొత్త రొమాంటిక్ మ్యాజిక్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

**హసిత్ గోలి మార్క్ వినోదం - క్రేజీ టైటిల్స్:**

'రాజ రాజ చోర', 'స్వాగ్' వంటి విభిన్నమైన పూర్తి వినోదాత్మక చిత్రాలతో దర్శకుడిగా తనదైన ముద్ర వేసుకున్న హసిత్ గోలి ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను హ్యాండిల్ చేస్తున్నారు. రవితేజ మాస్ క్రేజ్‌ను, శ్రీవిష్ణు సెటిల్డ్ కామెడీ టైమింగ్‌ను పర్ఫెక్ట్‌గా బ్యాలెన్స్ చేస్తూ ఆయన ఒక అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను దిల్ రాజు తన 'శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్' బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.

**2027 సంక్రాంతి బరిలో నవ్వుల జాతర:**

ఈ భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని ఫ్యామిలీ ఆడియన్స్‌ను ప్రధానంగా టార్గెట్ చేస్తూ, 2027 సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ పక్కా ప్లానింగ్‌తో ఉన్నారు. సంక్రాంతి సీజన్ అంటేనే ఫ్యామిలీస్ అన్నీ థియేటర్లకు క్యూ కడతాయి. అలాంటి టైమ్‌లో రవితేజ, శ్రీవిష్ణు కలిసి ఒకే ఫ్రేమ్‌లో కడుపుబ్బా నవ్వించడానికి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద నవ్వుల పండగ గ్యారెంటీ అనే చర్చ అప్పుడే మొదలైంది. మాళవిక మోహనన్ గ్లామర్ కూడా తోడవ్వడం ఈ పండుగ వినోదానికి మరింత ప్లస్ కానుంది. రవితేజ, శ్రీవిష్ణు, హసిత్ గోలి, దిల్ రాజు.. ఇలా క్రేజీ టాలెంట్ అంతా ఒకే చోట చేరి సృష్టిస్తున్న ఈ సినిమా టాలీవుడ్‌లో సరికొత్త ట్రెండ్ సెట్ చేయబోతోంది. మాస్ మహారాజా పక్కన మాళవిక మోహనన్ కెమిస్ట్రీ ఎలా ఉండబోతోందో చూడాలనే కుతూహలం అందరిలోనూ ఉంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు మరియు హీరోయిన్ ఎంపికకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది. మరి 2027 సంక్రాంతి బరిలో రాబోతున్న ఈ 'వీరాధివీరులు' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డుల సంచలనం సృష్టిస్తారో చూడాలి.

## అన్ని విమర్శలకు రోహిత్ శర్మ సమాధానం ఇదే... పాక్ మాజీ క్రికెటర్ ప్రశంసలు

- ఇంగ్లండ్‌పై రోహిత్ శర్మ సెంచరీ అద్భుతమని కమ్రాన్ అక్మల్ ప్రశంస
- తన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు రోహిత్ బ్యాట్‌తోనే జవాబిచ్చాడని వ్యాఖ్య
- రోహిత్, కోహ్లీ ఎప్పుడు రిటైర్ అవ్వాలో వారే నిర్ణయించుకుంటారని పేర్కొన్న అక్మల్
- భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని విశ్లేషణ
- కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టుకు నష్టం చేసిందని అభిప్రాయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో టీమిండియా ఓడినా, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ చేసిన సెంచరీపై పాకిస్థాన్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్ ప్రశంసల వర్షం కురిపించాడు. రోహిత్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు, విమర్శలకు ఈ సెంచరీయే సరైన సమాధానమని అభిప్రాయపడ్డాడు. లార్డ్స్‌లో రోహిత్ (138) ఆడిన ఇన్నింగ్స్ ఒక "స్టేట్‌మెంట్ ఇన్నింగ్స్" అని, 50 ఓవర్ల ఫార్మాట్‌లో తానెందుకు అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడో మరోసారి నిరూపించుకున్నాడని అక్మల్ అన్నాడు."2027 ప్రపంచకప్ జట్టులో రోహిత్‌కు చోటు దక్కదంటూ వదంతులు వ్యాపించాయి. కానీ, ఈ రోజు తన బ్యాట్‌తోనే వాటన్నింటికీ రోహిత్ సమాధానం చెప్పాడు" అని అక్మల్ ఒక పాడ్‌కాస్ట్‌లో పేర్కొన్నాడు. రోహిత్, విరాట్ కోహ్లీ లాంటి గొప్ప ఆటగాళ్లు ఎప్పుడు తప్పుకోవాలో వారే నిర్ణయించుకుంటారని, ఎవరూ వారిని బయటకు పంపలేరని స్పష్టం చేశాడు. భారత క్రికెట్ కోసం ఎన్నో త్యాగాలు చేసిన వారిని ప్రదర్శన ఆధారంగా అంచనా వేయాలని సూచించాడు.దఅయితే, ఈ మ్యాచ్‌లో భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని అక్మల్ విశ్లేషించాడు. ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ వంటి బౌలర్లు భారీగా పరుగులు ఇవ్వడం, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టును దెబ్బతీసిందని అన్నాడు. "ప్రధాన బౌలర్లే 70 నుంచి 100 పరుగులు ఇస్తే మ్యాచ్ గెలవడం కష్టం. కుల్‌దీప్ ఉండుంటే వికెట్లు తీసి ఫలితాన్ని మార్చేవాడేమో" అని అభిప్రాయపడ్డాడు.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 387/5 భారీ స్కోరు చేయగా, భారత్ 360/7 వద్ద పరిమితమై 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో సిరీస్‌ను 2-1 తేడాతో ఇంగ్లండ్ కైవసం చేసుకుంది.

## ఓటమిని జీర్ణించుకోలేకపోయారా?.. అర్జెంటీనా ప్రవర్తన సిగ్గుచేటంటున్న ఫుట్‌బాల్ ప్రపంచం!

- ఫిఫా వరల్డ్ కప్ 2026 ఫైనల్లో అర్జెంటీనాపై స్పెయిన్ విజయం
- ట్రోఫీ వేడుకలో స్పెయిన్‌ను అవమానించిన అర్జెంటీనా ఆటగాళ్లు
- ట్రోఫీ వేడుకకు వీపు చూపిన మెస్సీ సేన.. ఇది సిగ్గుచేటన్న విశ్లేషకులు
- గోల్డెన్ బాల్ అవార్డు సమయంలో మెస్సీ పేరుతో అభిమానుల నినాదాలు
- మ్యాచ్‌లో, ఆ తర్వాత ఇద్దరు అర్జెంటీనా ఆటగాళ్లకు రెడ్ కార్డులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైన తర్వాత డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా ప్రవర్తించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. నిన్న న్యూయార్క్ న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్లో స్పెయిన్ 1-0 తేడాతో అర్జెంటీనాను ఓడించి రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. అయితే, మ్యాచ్ అనంతరం జరిగిన పరిణామాలు ఫుట్‌బాల్ ప్రపంచంలో పెద్ద దుమారం రేపాయి. అర్జెంటీనా ఆటగాళ్లు, అభిమానుల ప్రవర్తన సంస్కారహీనంగా ఉందని, క్రీడాస్ఫూర్తికి మాయని మచ్చ తెచ్చిందని పలువురు విశ్లేషకులు మండిపడుతున్నారు.మ్యాచ్ ముగిసిన తర్వాత రన్నరప్ పతకాలు అందుకున్న అర్జెంటీనా ఆటగాళ్లు, కొత్త ఛాంపియన్లను అభినందించకుండా మైదానం నుంచి వెళ్లిపోయారు. స్పెయిన్ జట్టు ట్రోఫీని స్వీకరించేందుకు సిద్ధమవుతుండగా, లియోనెల్ మెస్సీ సహా అర్జెంటీనా ఆటగాళ్లందరూ మైదానంలో మరోవైపుకు వెళ్లి వీపు చూపిస్తూ నిలబడ్డారు. అంతకుముందు అర్జెంటీనా పతకాలు అందుకుంటున్నప్పుడు స్పెయిన్ ఆటగాళ్లు చప్పట్లతో అభినందనలు తెలిపినా, అర్జెంటీనా మాత్రం ఆ గౌరవాన్ని తిరిగి ఇవ్వలేదు. ఇది ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.ఇక, టోర్నమెంట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా నిలిచిన స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ రోడ్రి 'గోల్డెన్ బాల్' అవార్డు అందుకుంటున్నప్పుడు స్టేడియంలోని అర్జెంటీనా అభిమానులు 'మెస్సీ, మెస్సీ' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ పరిణామం అక్కడి వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఈ ఘటనలపై +శ్మీశ్రీ.ఎశీవి కథనం ప్రకారం.. టాక్‌స్పోర్ట్ బ్రాడ్‌కాస్టర్ అడ్రియన్ డర్హామ్ తీవ్రంగా స్పందించారు. "వారిలో కనీస సంస్కారం లేదు. ఈ రోజు వారు సిగ్గుపడే రీతిలో ప్రవర్తించారు. ఫైనల్లో ఓటమిని వారు అంగీకరించలేకపోతున్నారు. అర్జెంటీనా జట్టు ఈ ఆటకు, ప్రపంచకప్‌కు పూర్తి అవమానం" అని ఆయన ఘాటుగా విమర్శించారు.

"ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత సులువైన గ్రూప్‌లో డ్రా పొంది, నాకౌట్ దశలో కష్టపడి గెలిచి, ఇక్కడికొచ్చి తమను తాము అవమానించుకున్నారు" అని డర్హామ్ వ్యాఖ్యానించారు. టోర్నీ ఆద్యంతం అర్జెంటీనాకు అనుకూలంగా అనేక నిర్ణయాలు వచ్చాయని ఆయన ఆరోపించారు.

నిజానికి ఫైనల్ ముగిసిన వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లలో అసహనం కట్టలు తెంచుకుంది. దాంతో స్పెయిన్ ఆటగాళ్లపై దురుసుగా ప్రవర్తించారు. స్పెయిన్ ఆటగాళ్లతో గొడవకు దిగినందుకు లియాండ్రో పరేడెస్‌కు రెడ్ కార్డ్ చూపించారు. అంతకుముందు ఆట అదనపు సమయంలో ఎంజో ఫెర్నాండెజ్ కూడా రెండో ఎల్లో కార్డ్‌తో మైదానం వీడాడు. దీంతో ప్రపంచకప్ ఫైనల్లో రెడ్ కార్డ్ పొందిన ఆరో ఆటగాడిగా నిలిచాడు.

ఈ విజయంతో స్పెయిన్ రెండోసారి ప్రపంచకప్ గెలవడమే కాకుండా వరుసగా 38 మ్యాచ్‌లలో అపజయం ఎరుగని యూరోపియన్ జట్టుగా రికార్డు సృష్టించింది. అయితే, స్పెయిన్ చారిత్రక విజయం కంటే అర్జెంటీనా వివాదాస్పద ప్రవర్తనే ఎక్కువగా చర్చనీయాంశంగా మారింది.

## రూమర్స్ ఉంటనే మజా: రిటైర్మెంట్ పుకార్లపై తొలిసారి నోరువిప్పిన రోహిత్



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూఢిల్లీ: క్రికెట్ మక్కాగా పేరొందిన ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానంలో చారిత్రాత్మక సెంచరీతో విమర్శకుల నోర్లు మూయించిన టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ తొలిసారి తన రిటైర్మెంట్ పుకార్లపై స్పందించారు. ఇంగ్లాండ్?తో వన్డే సిరీస్ ముగిసిన అనంతరం హిట్ మ్యాన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇటువంటి రూమర్స్, విమర్శలు ఉంటేనే మజా ఉంటుందని అన్నారు. తనకు విమర్శలు కొత్తేమి కాదని.. తన సుదీర్ఘ కెరీర్?లో ఇటువంటి అటుపోట్లు ఎన్నో చూశానని అన్నారు. ఇటువంటి విమర్శలు, రూమర్స్ ఎన్ని వచ్చిన తాను పట్టించుకోనని.. తన దృష్టి మొత్తం కేవలం ఆటపైనే ఉంటుందని స్పష్టం చేశారు."నేను అరంగేట్రం చేసినప్పటి నుంచి నాపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. నేను జట్టులో ఉన్నంత కాలం ఆ విమర్శలు వస్తూనే ఉంటాయి. అది నాకు ముఖ్యం కాదు. మైదానంలో నేను ఏమి చేస్తాననేదే ముఖ్యం. జట్టు విజయంలో నా వంతు సహకారం అందించడానికి ప్రయత్నించాలనుకుంటున్నాను. నా దృష్టి అంతా దానిపైనే ఉంది. అయినా ఇలాంటి రూమర్స్, విమర్శలు లేకపోతే సరదా ఉండదు" అని రోహిత్ శర్మ పేర్కొన్నారు.

**విరాట్ తో బ్యాటింగ్ వేరే లెవల్:**

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో తన స్నేహం, కలిసి బ్యాటింగ్ చేయడం గురించి రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కోహ్లీతో కలిసి బ్యాటింగ్ చేయడం చాలా సరదగా ఉంటుందన్నాడు. మేము ఒకరినొకరు బాగా అర్థం చేసుకుంటామని.. క్రీజులో ఆలోచనలను పంచుకుంటామని తెలిపారు. కెరీర్?లో కోహ్లీ, తాను ఎన్నో విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పామని చెప్పారు. లార్డ్స్ వన్డేలో మా ఇద్దరి పార్ట్‌నర్ షిప్ కూడా చాలా బాగుందన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com